

యాదవ హైస్కూలులో ఎస్పీ తనిఖీలు

నగరంపాలెం: యాదవ హైస్కూల్‌లో జరుగుతున్న 'పది' పరీక్షల సరళిని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ గురువారం పరిశీలించారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,000, గరిష్ట ధర రూ.5,500, మోడల్ ధర రూ.4,300 వరకు పలికింది.

కరోనా @ జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా గురువారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.



న్యూస్‌రీల్

కొనసాగుతున్న 'పది' పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన ద్వితీయ భాష పరీక్షకు గుంటూరు జిల్లాలో 99.34 శాతం హాజరు నమోదైంది. 138 పరీక్ష కేంద్రాల పరిధిలో కేటాయించిన 26,382 మంది విద్యార్థులకు గానూ 26,219 మంది హాజరయ్యారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తాడేపల్లిలోని మూడు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా డీఈఓ పి.శైలజ ఐదు, డీఆర్‌ఓ చంద్రశేఖరరావు ఒకటి చొప్పున తనిఖీ చేయగా, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 32 కేంద్రాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు.

సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు 99.03 శాతం హాజరు

నరసరావుపేట ఈస్ట్: పదవ తరగతి పరీక్షలలో భాగంగా గురువారం జరిగిన సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు 99.03 శాతం విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ తెలిపారు. జిల్లా పరిధిలోని 126 సెంటర్లలో 24,305మంది విద్యార్థులకు గాను 24,084మంది విద్యార్థులు హాజరయ్యారని, మరో 221మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు వివరించారు. పరీక్ష నిర్వహణలో ఫ్లయింగ్ స్క్వాడ్ 10టీమ్‌లు, మరో 45 సిట్టింగ్ స్క్వాడ్ సిబ్బంది విధులు నిర్వహించారని తెలిపారు.

గుడ్‌ఫ్రైడే రోజు తరగతులా ?

ప్రభుత్వ మార్గదర్శకాలను మీరితే కఠిన చర్యలు : డీఈఓ



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా జాతీయ పండుగలు, పర్వదినాల్లో విద్యార్థులకు తరగతులను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ పాఠశాలల యాజమాన్యాలను హెచ్చరించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రైవేటు పాఠశాలల్లో పరీక్షలు జరిగే ఆరు రోజుల్లో ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు సెలవులుగా ప్రకటించిన దృష్ట్యా, నష్టపోయిన పనిదినాలను ఇతర సెలవు దినాల్లో పాఠశాలల నిర్వహణ ద్వారా భర్తీ చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులను వివిధ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమకు అనుకూలంగా మలచుకోవడాన్ని డీఈఓ శైలజ తప్పుబట్టారు. నష్టపోతున్న పనిదినాలను ఆదివారాల్లోనే భర్తీ చేయాలని, గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ వంటి పండుగల ద్వారా భర్తీ చేసేందుకు వీల్లేదని స్పష్టం చేశారు. గుడ్‌ఫ్రైడే రోజున విద్యార్థులకు తరగతులు నిర్వహించేందుకు సిద్ధమైన గుంటూరులోని ఓ ప్రైవేటు పాఠశాలకు షోకాజ్ నోటీసు ఇస్తున్నట్లు ఆమె చెప్పారు.

దూరవిద్య టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: దూరవిద్య టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ పి.శైలజ పేర్కొన్నారు. ఈనెల 17వ తేదీ వరకు జరగనున్న పరీక్షల నిర్వహణలో ఎక్కడా ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా పర్యవేక్షించాలని చీఫ్ సూపరింటెండెంట్లను ఆమె ఆదేశించారు. డీఈఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో శైలజ మాట్లాడుతూ ఏపీఓఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దూరవిద్య టెన్త్ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా ఎనిమిది కేంద్రాల పరిధిలో 1,744 మంది, 14 కేంద్రాల్లో జరుగుతున్న దూరవిద్య ఇంటర్ పరీక్షలకు 3,352 మంది చొప్పున హాజరవుతున్నట్లు తెలిపారు.

10,11 తేదీల్లో కోవిడ్ మాక్ డ్రిల్

గుంటూరు మెడికల్: పలు రాష్ట్రాల్లో కరోనా పాజిటివ్ కేసులు నమోదవుతున్న దృష్ట్యా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 10, 11 తేదీల్లో గుంటూరు జీజీహెచ్‌తోపాటు, పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కోవిడ్ మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు గురువారం తెలిపారు. ఆయా ఆసుపత్రుల్లో కరోనా ఏర్పాట్లకు సంబంధించి మాక్ డ్రిల్‌లో భాగంగా పలువురు ఉన్నతాధికారులు పాల్గొంటారని వెల్లడించారు.

ఆరోగ్య ప్రదాతకు బ్రహ్మరథం

జనహృదయ నేత.. సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్ రాకతో చిలకలూరిపేట పులకించింది. నేల ఈనిందా అన్నట్లుగా తమ ప్రాంతానికి మొదటిసారి వచ్చిన సంక్షేమ రథసారథిని చూసేందుకు జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. అన్నిదారులూ అటువైపే సాగగా సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. రోగుల చెంతకే వైద్యుడు.. ఇంటివద్దకే వైద్యం అనే వినూత్న విధానం ప్రారంభానికి పేట పట్టణం వేదికవగా.. సీఎం కురిపించిన అభివృద్ధి వరాల జల్లుల్లో సభికులు తడిసి ముద్దయి తమ కరతాళ ధ్వనులతో కృతజ్ఞతలు తెలిపారు. సీఎం ప్రసంగిస్తున్నంతసేపు ప్రాంగణమంతా జగన్నినాదంతో హోరెత్తింది.

- 'ఫ్యామిలీ డాక్టర్' ప్రారంభానికి చిలకలూరిపేటకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- పేటకు వరాల జల్లు కురిపించిన ముఖ్యమంత్రి
- తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.63 కోట్లు
- ముస్లిం శ్మశానవాటికకు 3 ఎకరాల భూమి కేటాయింపు
- అంబేడ్కర్, బీసీ, కాపు సామాజిక భవనాలు మంజూరు
- సాగునీటి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల మరమ్మతుల నిధులకు హామీ
- హర్షధ్వానాలతో సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు



లింగంగుంట్ల హెల్త్ విలేజ్ క్లినిక్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో వైద్యఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ఇన్‌చార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఉన్నతాధికారులు

సాక్షి, నరసరావుపేట, చిలకలూరిపేట: వైద్య రంగంలో సమూల మార్పులు తీసుకువచ్చి, ఫ్యామిలీ డాక్టర్ విధానం లాంటి విప్లవాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టడానికి చిలకలూరిపేటకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పల్నాడు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. వేలాదిగా తరలివచ్చి పేదల ఇంటి వద్దకే వైద్యం అందించే కార్యక్రమానికి తమ మద్దతు ప్రకటించారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో గురువారం జరిగిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ప్రారంభోత్సవ సభలో సీఎం వైఎస్ జగన్ పాల్గొన్నారు. సభకు వచ్చిన ప్రజలు కేరింతలు, నినాదాలతో సందడితో సభ ఉత్తేజభరితంగా మారింది.

హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం...

జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రికి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు సాదరస్వాగతం పలికారు. మంత్రులు కారుమూరి నాగేశ్వరావు, అంబటి రాంబాబు, విడదల రజని, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ప్రభుత్వ విప్‌లు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, జంగా కృష్ణామూర్తి, ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు, గోపిరెడ్డి, నంబూరు శంకర్‌రావు, అన్నాబత్తుని శివకుమార్, మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, ఏసురత్నం, తలశిల రఘురాం, అప్పిరెడ్డి, పోతుల సునీత, కల్పలత, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా, గుంటూరు రేంజ్ డీఐజీ త్రివిక్రమవర్మ, జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జేసీ శ్యాం ప్రసాద్, గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు తదితరులు మర్యాద పూర్వకంగా కలసి స్వాగతం పలికారు.

రోగులకు అందే సేవలపై ఆరా...

ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఉదయం పది గంటలకు లింగంగుంట్లలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేరుకున్నారు. అనంతరం రోడ్డు మార్గాన లింగంగుంట్లలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌కు చేరుకున్నారు. హెల్త్ క్లినిక్‌లో అందుతున్న సేవల గురించి వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు సీఎంకు వివరించారు. పక్కనే ఏర్పాటు చేసిన ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ స్టాళ్లను పరిశీలించారు. అక్కడ చిన్నారులను సీఎం ఆప్యాయంగా పలకరించారు. అక్కడి నుంచి సభా ప్రాంగణానికి ఉదయం 11.03 గంటలకు చేరుకున్నారు. సభావేదికపై ఏర్పాటు చేసిన మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కార్యక్రమం ప్రారంభించారు.



లింగంగుంట్ల హెల్త్ విలేజ్ క్లినిక్‌లో చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

దేశంలో మరెక్కడా లేని విధానమిది : కలెక్టర్



గతంలో లాగా వైద్యం కోసం డాక్టర్‌ల చుట్టూ రోగులు తిరగాల్సిన పరిస్థితి లేకుండా మన ఊరిలోనే, మన ఇంటికే వచ్చి ఉచితంగా వైద్యం అందించేలా దేశంలో మరెక్కడా లేని విధంగా ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ముఖ్యమంత్రి రూపొందించారని జిల్లా కలెక్టర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రతి మండలానికి కనీసం రెండు పీహెచ్‌సీలు, ప్రతి పీహెచ్‌సీకి కనీసం ఇద్దరు డాక్టర్లు ఉన్నారని, ప్రతి పీహెచ్‌సీకి ఒక 104 వాహనం అనుసంధానం చేసి, ఓ డాక్టర్ పీహెచ్‌సీలో ఉంటే మరో డాక్టర్ ప్రతి రోజు తనకు కేటాయించిన గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్యం అందిస్తున్నారన్నారు. ఈ విధానాన్ని గత సంవత్సరం అక్టోబర్ నుంచి జిల్లాలో పైలెట్ పథకంగా ప్రారంభించి 1,38,859 మందికి వైద్యసేవలు అందించడం జరిగిందన్నారు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని పల్నాడు జిల్లాలో ప్రారంభిస్తున్నందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

పాఠ్యం... ప్రథమం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వేసవి సెలవులకు ముందుగానే పాఠ్య పుస్తకాలు సిద్ధమవుతున్నాయి. 2023–24 విద్యాసంవత్సరంలో పునఃప్రారంభానికి ముందుగానే పాఠ్య పుస్తకాలను పాఠశాలలకు చేర్చాలనే నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ప్రభుత్వం తగు చర్యలు చేపడుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి యేటా పాఠశాలలు తెరవకముందే పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాల పంపిణీ జరుగుతోంది. అదే ఒరవడిలో కొద్దిరోజుల కిందటే గుంటూరు జిల్లా కేంద్రానికి తొలి విడతలో పాఠ్య పుస్తకాలు వచ్చాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికగా పాఠ్య పుస్తక పంపిణీ చేపడుతున్నారు.

ఉమ్మడి జిల్లాకు 23 లక్షల పాఠ్యపుస్తకాలు..

ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే ప్రతి ఒక్క విద్యార్థికీ పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వ ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేస్తుంది. జగనన్న విద్యాకానుక కిట్‌లో చేర్చి పంపిణీ చేసేందుకు పాఠ్య పుస్తకాలను ముద్రణ చేస్తున్న ప్రభుత్వం వాటిని ఎప్పటికప్పుడు జిల్లాకు చేర్చే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని 3,607 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల వారీగా 4,18,678 మంది విద్యార్థులకు 2023–24 విద్యాసంవత్సరానికి 23 లక్షల పాఠ్య పుస్తకాలతో పాటు వర్క్‌బుక్స్‌ను కలుపుకొని మొత్తం 47 లక్షల పుస్తకాలకు ప్రభుత్వానికి ఇండెంట్ పంపించారు.

పూర్తి నాణ్యత ప్రమాణాలతో..

జిల్లా నుంచి పంపిన ఇండెంట్ ఆధారంగా మొత్తం పుస్తకాలను మూడు విడతల్లో పంపేందుకు నిర్ణయించిన ప్రభుత్వం మొదటి విడతలో 10.92 లక్షల పుస్తకాలకు గాను రెండు లక్షల పుస్తకాలు వచ్చాయి. వీటిలో పదో తరగతి పాఠ్యాంశాల పుస్తకాలు ఉన్నాయి. పాఠ్య పుస్తక ముద్రణ కేంద్రాల నుంచి జిల్లాకు వచ్చిన పుస్తకాలను గుంటూరు నగరంలోని ప్రభుత్వ పాఠ్య పుస్తక గోదాముల్లో నిల్వ చేశారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పాఠ్య పుస్తకాల ముద్రణ చేపడుతున్న ప్రభుత్వం, ముద్రణ పూర్తయిన పాఠ్య పుస్తకాలను ఎప్పటికప్పుడు జిల్లాకు పంపేందుకు చర్యలు తీసుకుంటోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాలకు ఆర్టీసీ కార్గో బస్సుల్లో రవాణాకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాకు వచ్చిన పాఠ్య పుస్తకాలను ఆర్టీసీ కార్గో బస్సుల్లో మండల స్టాక్ పాయింట్లకు పంపుతామని జిల్లా పాఠ్య పుస్తక మేనేజర్ వనమా వజ్రబాబు చెప్పారు.

పాఠశాలల పునఃప్రారంభానికి ముందే వచ్చిన పాఠ్యపుస్తకాలు

- సెలవులకు ముందుగానే వచ్చే విద్యాసంవత్సరానికి ప్రణాళిక
- గుంటూరు జిల్లా కేంద్రానికి ప్రారంభమైన పాఠ్య పుస్తకాల రాక
- ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికన పుస్తకాల సరఫరా



గుంటూరు పాఠ్య పుస్తక గోదాము వద్ద పుస్తకాల లోడ్‌ను దింపుతున్న కార్మికులు

బాపట్ల జిల్లా కలెక్టర్‌గా రంజిత్‌బాషా



సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లా కలెక్టర్‌గా ప్రభుత్వం కృష్ణాజిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న రంజిత్ బాషాను నియమించింది. ఈ మేరకు గురువారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటుతో గతేడాది ఏప్రిల్ 4వ తేదీన రంజిత్‌బాషా కృష్ణాజిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. సరిగ్గా ఏడాది కాలం పూర్తికాగానే గురువారం రాత్రి జరిగిన బదిలీల్లో ప్రభుత్వం రంజిత్‌బాషాను బాపట్ల జిల్లాగా కలెక్టర్‌గా నియమించింది. రంజిత్‌బాషా స్వస్థలం కర్నూలు జిల్లా, నందికొట్కూరు. 2013లో గ్రూప్–1 అధికారిగా ఎన్నికయ్యారు. తొలుత కడప ఆర్‌డీఓగా పనిచేశారు. ఆ తర్వాత సీసీఎల్‌ఏలో పీడీసీ తహసీల్దార్‌గా పనిచేశారు. తర్వాత గుడివాడ ఆర్డీఓగా పనిచేశారు. అనంతరం పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటిమంత్రి లోకేష్ వద్ద ఓఎస్‌డీగా పనిచేశారు. 2018 ఫిబ్రవరిలో రంజిత్ బాషా ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. విజయవాడ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం గతేడాది ఏప్రిల్ 4న కృష్ణాజిల్లా కలెక్టర్‌గా నియమించింది.

సోషల్ వెల్ఫేర్‌కు బాపట్ల జిల్లా కలెక్టర్..

బాపట్ల జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. గతేడాది 4వ తేదీన బాపట్ల జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన విజయకృష్ణన్ ఏడాది కాలం పూర్తికాగానే ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు.

ఉద్యోగాల పేరిట జరిగే మోసాలపై అప్రమత్తత అవసరం

బాపట్లటౌన్: ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలపై యువత జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను బోగస్ కంపెనీలు ఏ విధంగా మోసంచేస్తున్నారనే విషయాలపై అవగాహన పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ ఖాళీ సమయంలో పనిచేసి అదనపు ఆదాయం ఆర్జించమంటూ, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రైవేటు కంపెనీలు జీతాలు ఇస్తాయే కానీ నిరుద్యోగుల దగ్గర డబ్బులు తీసుకోవనే విషయాన్ని నిరుద్యోగులు గ్రహించాలన్నారు. జాబ్ పోర్టల్స్‌లో నిరుద్యోగులు బయోడేటా అప్ లోడ్ చేస్తుంటారని, ఇదే అదునుగా భావించి సైబర్ నేరగాళ్లు నిరుద్యోగులు అప్‌లోడ్ చేసిన రెజ్యూమ్‌ల నుంచి వివరాలను సేకరించి మోసం చేసే అవకాశం ఉందన్నారు.

8 నుంచి గుంటూరు మీదుగా వందేభారత్ రైలు

వివరాలు వెల్లడించిన డీఆర్‌ఎం రామకృష్ణ



మాట్లాడుతున్న గుంటూరు డీఆర్‌ఎం ఆర్.రామకృష్ణ

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ మీదుగా నడిచే వందే భారత్ రైలును ఈ నెల 8వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారని గుంటూరు డీఆర్‌ఎం ఆర్. రామకృష్ణ వెల్లడించారు. స్థానిక పట్టాభిపురంలోని తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందే భారత్ రైలులో సికింద్రబాద్ నుంచి తిరుపతికి 8.30 గంటల్లోనే ప్రయాణికులు చేరుకుంటారని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి గుంటూరుకు కేవలం 3.45 గంటల వ్యవధిలో రైలు చేరుకుంటుందన్నారు. ఈనెల 8వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన రోజు మాత్రం సికింద్రాబాద్ స్టేషన్ నుంచి ఉదయం 11.30 గంటలకు రైలు బయలు దేరి నల్గొండ, మిరియాలగూడ, పిడుగురాళ్ల మీదుగా గుంటూరు రైల్వే స్టేషన్‌కు మధ్యాహ్నం 3.35 గంటలకు చేరుకుంటుందని, అక్కడ నుంచి తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడురుల మీదుగా తిరుపతి స్టేషన్‌కు రాత్రి 9 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. ఈనెల 9వ తేదీ నుంచి 20701 నంబరుతో నడిచే ఈ రైలు ఉదయం 6 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలు దేరి గుంటూరుకు 9.45 గంటలకు చేరుకుందని, గుంటూరులో 10 నిమిషాల పాటు వేచి ఉండి, అక్కడ నుంచి ఒంగోలు, నెల్లూరుల మీదుగా తిరుపతి స్టేషన్‌కు మధ్యాహ్నం 2.30 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. అలాగే 20702 నంబరు వందేభారత్ రైలు తిరుపతి నుంచి మధ్యాహ్నం 3.15 గంటలకు బయలు దేరి గుంటూరుకు రాత్రి 7.45 గంటలకు చేరుకుని, ఇక్కడినుంచి సికింద్రాబాద్‌కు రాత్రి 11.45 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. ఈ రైలు వారంలో 6 రోజులు పాటు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందని ఒక్క మంగళవారం మాత్రమే అందుబాటులో ఉండదని తెలియజేశారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఇంటి వద్దకే వైద్య సేవలు

వేమూరులో పథకాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

వేమూరు: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటి ముందుకే వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని బాపట్ల జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. వేమూరు మార్కెట్ యార్డులో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకే ప్రభుత్వం ఈ విధానాన్ని తెచ్చిందన్నారు. ప్రతి మండల ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు వైద్యులను నియాకం చేశామన్నారు. ఒకరు ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందించాలని, మరొకరు 104 వాహనం ద్వారా గ్రామాల్లో వెళ్లి ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. రోగులకు పరీక్షలు చేసి 105 రకాలు మందులు అందించడం జరుగుతుందని ఆమె చెప్పారు. వైద్యులు షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లోకి వెళ్లి వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. రోగులు మంచం మీద ఉంటే, వారి దగ్గరకు వెళ్లి వైద్య సేవలు అందించడం జరుగుతుందని ఆమె చెప్పారు. డీఎంహెచ్‌ఓ విజయమ్మ, రేపల్లె ఆర్డీఓ పార్థసారథి, ఎంపీపీ యల్లమాటి మోహన్, జాలాది రూబేను, జడ్పీటీసీ గాజుల హేమలత, మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రోహిణి, సిబ్బంది పాల్గొన్నారు.



వేమూరులో జెండా ఊపి 104 వాహనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

మాదక ద్రవ్యాల విక్రయాలు అరికట్టాలి

బాపట్ల: మాదక ద్రవ్యాల విక్రయం, వినియోగం బాపట్ల జిల్లాలో సమూలంగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ ఆదేశించారు. మాదక ద్రవ్యాల నిరోధక జిల్లాస్థాయి కమిటీ సమావేశం గురువారం కలెక్టర్ చాంబర్లో జరిగింది. నిషేధిత మాదక ద్రవ్యాలకు విద్యార్థులు ఆకర్షితులు కాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ విజయకృష్ణన్ చెప్పారు. ఇటీవల మార్టూరు మండలంలో ఓ ఇంటి ఆవరణలోనే గంజాయి మొక్కలు సాగు చేస్తూ పట్టుబడటంపై కలెక్టర్ ఆరాతీశారు. పొరుగు రాష్ట్రాల నుంచి గంజాయి అక్రమ రవాణా జరుగుతుందనే అంశంపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. గడిచిన మూడు నెలల్లో బాపట్ల జిల్లాలో 58 కేసులు నమోదు కావడంపై క్షుణ్ణంగా సమీక్షించారు. ఆర్టీసీ, రైల్వే ద్వారా బాపట్లకు ఎగుమతి, దిగుమతి అయ్యే పార్శిళ్లను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. మెడికల్ షాపుల్లో ఔషధాల అమ్మకాలపై నిఘా ఉంచాలన్నారు.

అక్రమ రవాణాను అరికట్టాం: ఎస్పీ వకుల్ జిందాల్

మాదక ద్రవ్యాల అక్రమ రవాణపై ఉక్కుపాదం మోపామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఇప్పటికే స్టువర్టుపురం, మార్టూరు, చీరాల, రేపల్లె ప్రాంతాలపై ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేశామన్నారు. వివిధ కళాశాలల వద్ద బడ్డీ దుకాణాల్లో గంజాయి వంటి మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఏఎస్పీ మహేష్, ఆర్డీఓ జి.రవీందర్, పి.సరోజిని, ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారిణి రాజ దెబోరా, డీఈఓ రామారావు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించేందుకే సచివాలయ వ్యవస్థ

జిల్లా పౌర సంబంధాల అధికారి మోహనరాజు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా పౌర సంబంధాల అధికారి మోహనరాజు

చినగంజాం: ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టారని జిల్లా పౌర సంబంధాల అధికారి టీ మోహనరాజు పేర్కొన్నారు. గురువారం ఆయన మండలంలోని రాజుబంగారుపాలెం సచివాలయాన్ని సందర్శించి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఆయన స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం పంపిణీని పరిశీలించి, భోజనం నాణ్యతను పరిశీలించారు. పక్కనే ఉన్న అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించి కేంద్రంలో పిల్లల హాజరుశాతాన్ని పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రంగని శ్రీనివాస రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తున్న ఇద్దరు అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న అధికారులు, స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలు

మార్టూరు: తమ నివాసాల మధ్య గంజాయి మొక్కలను సాగు చేస్తున్న ఇద్దరిని పర్చూరు సెబ్ సీఐ యశోదరాదేవి గురువారం ఉదయం అరెస్టు చేశారు. సీఐ వివరాల మేరకు.. స్థానిక ఆది బాంబవ కాలనీలో బుధవారం రాత్రి సీఐ తమ బృందంతో దాడి నిర్వహించారు. అందులో భాగంగా కాలనీలో పక్కపక్క నివాసాల్లో ఉంటున్న చిన్న కర్ణిక కొండయ్య, పెద్ద కర్ణిక సాయమ్మలు తమ నివాసాల మధ్య పూల చెట్లలో గంజాయి మొక్కలు సాగు చేస్తున్న విషయాన్ని గుర్తించారు. 17 కిలోల బరువు గల నాలుగు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకొని కొండయ్యను అదుపులోనికి తీసుకున్నారు. గురువారం ఉదయం పరారీలో ఉన్న సాయమ్మను సైతం అధికారులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేశారు.

కోర్టును మోసం చేసిన న్యాయవాది గుమస్తాపై కేసు

సత్తెనపల్లి: కోర్టును చీటింగ్ చేసిన న్యాయవాది గుమస్తాపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని సీనియర్ న్యాయవాది చలువాది చిన్న సత్యనారాయణ వద్ద గుమస్తాగా పనిచేస్తున్న దుద్దేల వెంకట్రావు 2021వ సంవత్సరం నుంచి రూ.95,978 నకిలీ చలానాలను రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు సమర్పించి కోర్టును మోసం చేశాడు. విచారణ అనంతరం రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సూపరింటెండెంట్ సుబ్బారావు ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ యు.శోభన్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా ఈర్లగంగమ్మ వార్షిక తిరునాళ్ల

- పోటెత్తిన భక్తజనం
- ప్రభల వేడుకల్లో శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య
- బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాల నుంచి భారీగా వచ్చిన భక్తులు



గంగమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి



విద్యుత్ వెలుగుల్లో ప్రభలు

బల్లికురవ: భక్తుల కోర్కెలు తీర్చే బంగారుతల్లి ఈర్ల గంగమ్మ ఆలయ వార్షిక తిరునాళ్ల అంగరంగ వైభవంగా జరుగుతోంది. మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామ సమీపంలో ఈర్లకొండకు దిగువ భాగంలో వేంచేసి ఉన్న గంగమ్మ తిరునాళ్ల గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచే ఆలయ కమిటీ అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేపట్టారు. మండలంలోని వివిధ గ్రామాలతోపాటు ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకుని పొంగళ్లు పెట్టి అమ్మవారికి నివేదించారు. బల్లికురవ, నక్కబొక్కలపాడు, పాతమల్లాయపాలెం, కొత్తమల్లాయపాలెం, గ్రామాల్లో వైఎస్సార్ సీపీ, టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 10 భారీ ఎలక్ట్రిక్ ప్రభలతోపాటు అనేక మొక్కుబడి ప్రభలు అమ్మవారి సన్నిధికి చేరాయి. ఎలక్ట్రిక్ ప్రభలపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తులు భారీగా తరలిరావటంతో మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ మైదానం రోడ్లు భక్తజన సంద్రంగా మారాయి. బాపట్ల డీఎస్పీ ఏ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇన్‌చార్జి సీఐ ఫిరోజ్, ఎస్సై వీ.వేమన సిబ్బందితో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా కేటాయించిన ప్రదేశాల్లో బైక్‌లు, వాహనాలు నిలుపుదల చేయించి శాంతిభద్రతలు పర్యవేక్షించారు. ఆలయ కమిటీ, గ్రామాల వైఎస్సార్, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆలయ సన్నిధానం వద్ద అన్నదానం నిర్వహించారు.

గ్రామాలు సుభిక్షంగా ఉండాలి..

అమ్మవారి కరుణ కటాక్షలతో గ్రామాల్లోని రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ఈర్లకొండ నుంచి తీసే గ్రానైట్ రాయికి గిరాకీ ఉండాలని రాష్ట్ర శాప్‌నెట్ ఛైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. గురువారం రాత్రి బల్లికురవ, నక్కబొక్కల పాడు, కొత్తమల్లాయపాలెం, పాతమల్లాయపాలెం, గ్రామాల్లో వైఎస్సార్ సీపీ అభిమానులు ఏర్పాటు చేసిన ప్రభలపై చైతన్య మాట్లాడి ఉత్సాహపరిచారు. బల్లికురవ నుంచి సంతమాగులూరు వెళ్లే రోడ్డుకు పడమర భాగంలో ఉన్న గంగమ్మ ఆలయానికి వెళ్లే రోడ్డు మోకాళ్ల లోతు గోతులతో ఉన్న గతపాలకులు పట్టించుకోలేదన్నారు. రూ. 50 లక్షలతో 450 మీటర్ల పొడవు గలిగిన ఈ రోడ్డును సిమెంట్ రోడ్డుగా 20 రోజుల్లో అభివృద్ధి పరిచామని చెప్పారు. రాబోయే రోజుల్లో కూడా గంగమ్మ ఆలయాన్ని మరింత అభివృద్ధి పరుస్తామని చైతన్య చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చింతల పేరయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వివక్ష అంటూ విషప్రచారం సరికాదు

పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

సాక్షి, నరసరావుపేట: ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పల్నాడు జిల్లా కలెక్టర్‌కు అవమానం జరిగిందని సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారంపై కలెక్టర్ శివ శంకర్ లోతేటి స్పందించారు. కలెక్టర్ పట్ల వివక్ష చూపారంటూ చేస్తున్న విషప్రచారం సరికాదంటూ హితవు పలికారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందన ఆయన మాటల్లోనే... సాంప్రదాయం ప్రకారం సీఎం కార్యక్రమాలలో ఆయా పథకం లబ్ధిదారులు లేదా ఆ కార్యక్రమంలో సేవలు అందించే సిబ్బందితో ముఖ్యమంత్రి గ్రూప్ ఫొటో దిగడం ఆనవాయితీ. అదే విధంగా ఈ ఏడాది జనవరి నెలలో వినుకొండలో జరిగిన చేదోడు కార్యక్రమంలో నగదు పొందే లబ్ధిదారులతో సీఎం గ్రూప్ ఫొటో దిగారు. గురువారం ఫ్యామిలీ డాక్టర్ విధానంలో సేవలు అందించే డాక్టర్లు, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, ఏఎన్‌ఎంలతో కలసి ఫొటో దిగారు. ఇందులో ఆ శాఖకు చెందిన మంత్రి విడదల రజిని సైతం ఉన్నారు. ఇందులో కలెక్టర్ ఫొటో దిగే సాంప్రదాయం ఏదీ లేదు. ఈ ఉద్దేశంతోనే నేనే పక్కన నిల్చున్నాను. ఐతే ఓ వర్గానికి చెందిన కొందరు పనిగట్టుకొని కలెక్టర్‌కు వివక్ష ఎదురైందని, పక్కన నిల్చోబెట్టారంటూ మాట్లాడటం సరికాదు. ఇందులో ఎటువంటి వివక్ష లేదు. విజ్ఞులైన వారు ఆలోచించి ఈ ప్రచారానికి అడ్డుకట్ట వేయాలి. వైద్యం రంగంలో ఎంతో గొప్ప కార్యక్రమం ప్రారంభమైన ఈ శుభగడియల్లో ఇలాంటి విషప్రచారం సరికాదు. దయచేసి దీన్ని ఇంతటితో వదిలేయాలని కోరుతున్నాను.

ఆత్మీయ స్వాగతం



పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్లకు గురువారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్సీ పోతుల సునీత పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. -చిలకలూరిపేట

నేటి నుంచి ఎడ్ల బండ లాగుడు పోటీలు



మాచర్ల: పల్నాడు పుణ్యక్షేత్రమైన లక్ష్మీచెన్నకేశవస్వామి తిరునాళ్లను పురస్కరించుకుని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రీజనల్ విభాగ యువజన అధ్యక్షులు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిల ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఈనెల 11వ తేదీ వరకు ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ రైతు బీమా ఆధ్వర్యంలో 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్లతో బండ లాగుడు, బల ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా వివిధ రకాల పోటీలను నిర్వహిస్తారు. పోటీల పోస్టర్లు, కరపత్రాలను ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డిలు గురువారం ఆవిష్కరించారు. ఎడ్ల బండ లాగుడు పోటీలో బుల్లెట్ బైకు, లక్షల విలువైన నగదును విజేతలకు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రీజనల్ విభాగ యువజన అధ్యక్షులు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు అందజేయనున్నారు. వీరితోపాటు పలువురు బహుమతులు అందజేసేందుకు ముందుకొచ్చారు. శుక్రవారం నుంచి ప్రారంభమై 11వ తేదీ వరకు గుంటూరు రోడ్డులోని మహాలక్ష్మీ కోల్డ్ స్టోరేజి ఎదురు ప్రాంగణంలో బండ లాగుడు, బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాలుగు విభాగాల్లో జరిగే పోటీలను జయప్రదం చేయాలని కోరారు.

అంజన్నకు లక్ష తమలపాకుల అర్చన



తమలపాకుల అర్చనలో ప్రసన్నాంజనేయస్వామి

అద్దంకి: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి పౌర్ణమి సందర్భంగా గురువారం లక్ష తమలపాకులతో అర్చనను అత్యంత వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రాతఃకాల సమయంలో సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం, స్వామివారికి అభిషేకం, అలంకరణ, వేదపండితులు, అర్చకులు, ఉభయదాతల వేదస్వస్తి, మంగళవాయిద్యాలతో ఆలయ ప్రదక్షిణ, వినాయక స్వామి వారికి సుబ్రహ్మణ్యస్వామి వారికి, జీవధ్వజ ఉష్ణవహనానికి నారికేళ సమర్పణ, గణపతిపూజ, రుత్విక్‌వరణ, 11 వరుసలుగా దేవస్థాన వేదపండితులు అర్చకులచే తమలపాకులతో అర్చన చేశారు. తరువాత స్వామివారికి మహానివేదన, పంచహారతుల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఉభయదాతలుగా మద్దిపాడు మండలం ఇనమనమెళ్లూరు గ్రామానికి చెందిన వీరిశెట్టి వెంకట్రావు, ధనలక్ష్మి దంపతులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పాల్గొన్న వారికి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

మిరియాలలో వైభవంగా ఆవుదేవర తిరునాళ్ల

కారెంపూడి: మండలంలోని మిరియాల గ్రామంలో ఆవుదేవర తిరునాళ్ల గురువారం రాత్రి వైభవంగా జరిగింది. వేలాదిగా ప్రజలు ఆవుదేవరను దర్శించుకుని పూజలు చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రాత్రి ఆవుదేవర గుడికి విచ్చేసి ఆవుదేవరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా గురువారం రాత్రి నుంచి యాదవులు వివిధ క్రతువులు నిర్వహించారు. ముందుగా పిల్లనగ్రోవి కార్యక్రమాన్ని నిర్వహించారు. పుట్టలో ఉన్న పిల్లన గ్రోవిని దేవర భక్తుడు బయటకు తీసే కార్యక్రమం జరిగింది. తర్వాత ఆలయం ముందు ముగ్గు వేశారు. ఆ ముగ్గుపై పాలుపొంగించి ఆ తర్వాత దానిపై ఆవును నడిపించారు. శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల నుంచి గ్రామంలోని గోవులు, ఎద్దులను రైతులు గుడి చుట్టూ తిప్పి చల్లగా చూడాలని ఆవుదేవరను మొక్కుకునే కార్యక్రమం జరుగుతుందని దేవర ఆచారవంతులు తెలిపారు. ఇదిలా ఉంటే మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమాన్ని గ్రామస్తులు నిర్వహించారు. సీఐ దార్ల జయకుమార్, ఎస్‌ఐ రామాంజనేయులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ బత్తుల ఏడుకొండలు, ఉప సర్పంచ్ దారెడ్డి ప్రభాకరరెడ్డి తదితరులతో కూడిన కమిటీ భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు రెండు విద్యుత్తు ప్రభలు కట్టారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

శ్రీనాథ్‌రెడ్డిది విలక్షణ వ్యక్తిత్వం

ప్రెస్ అకాడమీ మాజీ ఛైర్మన్ సంస్మరణ సభలో ప్రభుత్వ సలహాదారు సజ్జల



ప్రసంగిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, చిత్రంలో దేవులపల్లి అమర్ తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సి. రాఘవాచారి ఏపీ ప్రెస్ అకాడమీ మాజీ ఛైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డిది విలక్షణమైన వ్యక్తిత్వమని ప్రభుత్వ సలహాదారు(ప్రజావ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం విజయవాడ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ప్రెస్ అకాడమీ ఛైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి సంస్మరణ సభ జరిగింది. తొలుత సజ్జల రామకృష్ణారెడ్డి, దేవులపల్లి అమర్, ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు శ్రీనాథ్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. సంస్మరణ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వాస్తవానికి శ్రీనాథ్‌రెడ్డి భూస్వామ్య కుటుంబం నుంచి వచ్చారని, ఆయన జర్నలిజంలోకి అనుకోకుండా వచ్చి ఉండొచ్చని తాను భావిస్తున్నానన్నారు. బహుశా ఆయన వ్యక్తిత్వంలోనే జర్నలిజం తాలూకా విలక్షణత ఉండి ఉంటుందన్నారు. ఇద్దరు వ్యక్తుల మధ్య లేదా గ్రూపుల మధ్య సమస్య ఉన్నా నిష్పక్షపాతంగా, కఠినంగా తాను చెప్పాలనుకున్న విషయం చెప్పే లక్షణం ఆయనకు తొలి నుంచి ఉందన్నారు. ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా మార్పు కోసం ఎంతో పరితపించారన్నారు. కరోనా సమయంలోనూ జూమ్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించి జర్నలిస్టులు వృత్తి నైపుణ్యాలు పెంచుకునేందుకు కృషి చేశారన్నారు. విక్రమ సింహపురి యూనివర్సిటీ భాగస్వామ్యంతో జర్నలిస్టులకు అకాడమీ తరఫున సర్టిఫికెట్ కోర్సును అందించారన్నారు. ఆయన మరణం వ్యక్తిగతంగా తనకు, జర్నలిజానికి తీరని లోటన్నారు.

ఆయన పేరుమీద గోల్డ్ మెడల్ ఇవ్వాలి..

రాష్ట్ర ప్రభుత్వ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ శ్రీనాథ్‌రెడ్డి పేరు మీద యోగి వేమన యూనివర్సిటీ జర్నలిజం విద్యార్థులకు గోల్డ్ మెడల్ అందించేందుకు కృషి చేయాలన్నారు. శ్రీనాథ్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అంతకు ముందుకు ఐజేయూ ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు, ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి రాయలసీమ ప్రాంత సమస్యలపై నిరంతరం పోరాడారన్నారు. అనంతరం సజ్జల రామకృష్ణారెడ్డి ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ రూపొందించిన క్యాలెండర్ ఆవిష్కరించారు. సంస్మరణ సభలో ఏపీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, కె. జయరాజు, చావా రవి, కొండా రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేరుపెట్టి పిలవటం నా జీవితంలో మరువలేను..

వైద్యాధికారి ఇబ్రహీం



శావల్యాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నన్ను పేరు పెట్టి పిలవటం నా జీవితంలో మరిచిపోలేని రోజు అని మండల ప్రాథమిక వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం అన్నారు. గురువారం చిలుకలూరిపేట మండలం లింగగుంట గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా జిల్లాస్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శావల్యాపురం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిలిచింది. జిల్లా స్థాయిలో నెల రోజులపాటు ఎంఎల్‌హెచ్‌వోలకు ప్రత్యేకంగా శిక్షణా ఇవ్వటంతో కీలకపాత్ర పోషించిన వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం సేవలను సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించి ఆలింగనం చేసుకుని అభినందించారు. రాష్ట్రస్థాయిలో ఎంఎల్‌హెచ్‌పీలకు ఆరోగ్య సేవలపై ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహణకు రాష్ట్ర వైద్య ఆరోగ్య ప్రధానకార్యదర్శి కృష్ణబాబు శావల్యాపురం మండలం ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీంను ప్రత్యేకంగా నియమించారు.